
క్లుప్తంగా

పేదలకు రాయగడ దర్శనం



రాయగడ ఆలయం వద్ద వావిలవలసకు చెందిన వృద్ధులు

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ గ్రామంలోని పేదలను రాయఘడ మజ్జిగౌరమ్మ దర్శనానికి మంగళవారం తీసుకెళ్లారు. రాయఘడ ఐపీఎస్ అధికారి వివేక్ దర్శనానికి అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు సిద్ధార్థ తెలిపారు. 15 మంది పేద వృద్ధులకు దర్శనం కల్పించడంతో పాటు చీరలు, ప్రసాదాలు అందించారన్నారు.

కాలువల నిర్మాణానికి భూమిపూజ

సంతకవిటి: మండలంలోని జావాం గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులతో కాలువల నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ బోనెల ప్రసాద్ తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు

రేగిడి: మండలంలో లక్ష్మీపురం, ఆడవరం, కొమెర తదితర గ్రామాల్లో మంగళవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. మురుగు కాలువల్లో పూడికలు తొలగించి, డంప్‌యార్డుకు తరలించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని లక్ష్మీపురం సర్పంచ్ వెంకటేశ్వరరావు కోరారు.

కార్మిక పక్షపాతి ఏఐటీయూసీ



ఏఐటీయూసీ పతాకావిష్కరణ చేస్తున్న జిల్లా కార్యదర్శి

రాజాం సిటీ: కార్మికుల పక్షపాతి ఏఐటీయూసీ అని ఆ సంఘ జిల్లా కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్ అన్నారు. మంగళవారం ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పక్షాన పోరాటాలు చేసి సాధించిన విజయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం



తెర్లాంలో వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న వీధికుక్కలు

తెర్లాం: మండల కేంద్రంలో వీధికుక్కల స్వైరవిహారంతో ప్రజలు, వాహన చోదకులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద, వీధుల్లో అధిక సంఖ్యలో కుక్కలు తిరుగుతుండడంతో ఎవరిని ఎక్కడ కరుస్తాయోనని భయపడుతున్నారు. వాహనదారులు కూడా వాహనాల కింద కుక్కలు పడితే ప్రమాదాలు జరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మున్సిపల్ కమిషనర్ పరిశీలన

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని అగురువీధిలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ తాగునీటి పైపులైన్ల ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులకు పనులకు సంబంధించి, పలు సూచనలు చేశారు.

రాజరాజేశ్వరీదేవికి పూజలు

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుగ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ చేశారు.

ఐకమత్యమే మహాబలం

- ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవంలో వక్తలు



రాజాం: ఒమ్మిలో ఐక్యతా ప్రతిజ్ఞ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు



సంతకవిటి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇండియా మ్యాప్ ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

రాజాం: మండలంలోని ఒమ్మి గ్రామ సచివాలయం వద్ద జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని(సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి) మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి ఎంపీపీ లావేటి సులోచన, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ తొలి హోం మంత్రిగా భారతదేశాన్ని సమైక్యంగా ఉంచేందుకు వల్లభాయ్ పటేల్ చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం మండల కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, స్థానిక నాయకులు వంగా శ్రీనివాసరావు, ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, పంచాయతీ కార్యదర్శి దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- సంతకవిటి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దేశ చిత్రపటం ఆకృతిలో మానవహారంగా ఏర్పడి సమైక్యత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.జనార్దనరావరావు, ఎస్ఎస్ఎస్ కార్యనిర్వహణాధికారి ఎం.షణ్ముఖరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.
- బాడంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సమైక్యతా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. మాజీ ఉపప్రధాని, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత పటేల్ చిత్రపటానికి సిబ్బంది పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. అనంతరం ఆయన దేశ సమగ్రతకు పాటుపడిన తీరును వక్తలు కొనియాడారు. అందరూ కుల, మతాలకు అతీతంగా ఐక్యంగా ఉండాలన్నారు. అనంతరం ఐక్యతతో మెలుగుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ పీవోలు వి.శంకరరావు, డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- తెర్లాం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంతో పాటు అంగన్‌వాడీ కేంద్రం-5లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి మంగళవారం నిర్వహించారు. జాతీయ సమైక్యతా దినోత్సవంగా ఆయన జయంతిని ఏటా జరుపుకుంటుండగా, కార్యక్రమంలో పాల్గొన్న వారంతా పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం దేశ సమగ్రతకు ఆయన కృషిని కొనియాడారు.
- బొబ్బిలి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉక్కుమనిషి, మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో పోతుల రవికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



బాడంగి జూనియర్ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమం



తెర్లాం-5 అంగన్‌వాడీ కేంద్రంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి, లైబ్రేరియన్ కృష్ణమూర్తి



తెర్లాం ఎంపీడీవో కార్యాలయం వద్ద జాతీయ సమైక్యతా దినోత్సవంలో ఎంపీడీవో శంబంగి రామకృష్ణ, తదితరులు



బొబ్బిలి: పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

వైఎస్సార్‌సీపీ నేత ఔదార్యం



గోతిలో కూరుకుపోయిన భారీ వాహనాన్ని క్రేన్‌ల సాయంతో తీస్తున్న దృశ్యం

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులో డోలపేట జంక్షన్ వద్ద రోడ్డు పక్కన భారీ వాహనం కూరుకుపోయింది. మూడు రోజులుగా వాహనం అలాగే ఉండిపోవడంతో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. సమస్యపై స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ తలే రాజేష్ స్పందించారు. తన సొంత నిధులు రూ.30 వేలు వెచ్చించి నాలుగు క్రేన్‌ల సాయంతో కూరుకుపోయిన భారీ వాహనాన్ని బయటకు తీయించి ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టారు. స్థానికులు, ప్రయాణికులు డాక్టర్ రాజేష్ చొరవను అభినందించారు.

రిఫర్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- ఎంపీడీవో శంబంగి రామకృష్ణ



మాట్లాడుతున్న ఎంపీడీవో శంబంగి రామకృష్ణ

తెర్లాం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉన్నత వైద్య సేవల కోసం రిఫర్ చేసిన కేసులు(రోగులు)పై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తెర్లాం, పెరుమాళి పీహెచ్‌సీల వైద్యులు, ఎంపీహెచ్ఏలు, ఏఎన్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో వైద్యాధికారులు, సిబ్బంది పాత్ర అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మండలంలో 174 మంది రోగులను వేరే ప్రాంతాల్లోని ఆస్పత్రులకు మెరుగైన వైద్య సేవల నిమిత్తం రిఫర్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. వారంతా వారికి కేటాయించిన ఆస్పత్రులకు వెళ్లి, వైద్యం చేయించుకున్నారా, లేదా అనే విషయం తెలుసుకోవాలన్నారు. వారు ఇంతవరకు వారికి కేటాయించిన ఆస్పత్రికి వెళ్లకపోతే ఎందుకు వెళ్లలేదో వారి వద్దకు వెళ్లి అడగాలన్నారు. వైద్య సేవలు పొందిన వారి వద్దకు వెళ్లి, ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి ఏ విధంగా ఉందో అడిగి తెలుసుకోవాలన్నారు. వారికి సంబంధించి, ప్రత్యేక రికార్డు నిర్వహించాలన్నారు. సమావేశంలో తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు, సీహెచ్‌వో భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నందెన్న ఉత్సవాలు



గజరాయునివలసలో పూజలందుకుంటున్న నందెన్న, పార్వతీపరమేశ్వరులు

బాడంగి: మండలంలోని ముగడ, డొంకినవలస, గజరాయునివలస, పాల్తేరు, రేజేరు, వాడాడ, కోడూరు తదితర గ్రామాల్లో నందెన్న ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మండపాల్లో కొలువైన నందెన్న, గౌరీదేవి సమేత పార్వతీపరమేశ్వరుల విగ్రహాలకు భక్తులు పూజలు చేసి, ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నారు. కార్తీక పౌర్ణమి రోజు వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. ఆ తర్వాత అనుపోత్సవం నిర్వహిస్తారు.

వరిపంట పరిశీలన



చినవాడాడలో ఎండిపోతున్న వరిచేను పరిశీలిస్తున్న ఏవో శిరీష

బాడంగి: వర్షాలు లేని కారణంగా పంటలు ఎండిపోతున్నాయన్న నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఏవో కె.శిరీష మంగళవారం పర్యటించి, ఎండిపోయే దశలో ఉన్న వరిపంటను పరిశీలించారు. పంట ఎండిపోకుండా ఉండేందుకు రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. మరో వారం రోజుల పాటు వరిచేలలో నీటి ఎద్దడిని తట్టుకోవడానికి మల్టీకే(1345) ద్రావణాన్ని ఎకరాకు 2 కిలోల మందు చొప్పున 20 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాల తెలిపారు.

కుళాయి కనెక్షన్ ప్రారంభం

రాజాం: పట్టణంలో శిష్టకరణ సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్ వద్ద మంగళవారం తాగునీటి కుళాయి కనెక్షన్ ప్రారంభించారు. రాజాం ప్రాంతీయ శిష్టకరణ సంక్షేమ సంఘం, మున్సిపల్ అధికారుల సమన్వయంతో తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు శిష్టకరణ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉరిటి శశిభూషణరావు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాజాం ఉపాధ్యక్షుడు కల్లేపల్లి శ్రీనివాసరావు, ఉరిటి జగదీష్, కార్యదర్శి కుప్పిలి రమేష్, బలివాడ నాగేశ్వరరావు, ఉరిటి రజనీకాంత్ పాల్గొన్నారు.

నేడు గరికిపాడులో 'గడపగడపకు మన ప్రభుత్వం'

సంతకవిటి: మండలంలోని గరికిపాడులో బుధవారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొంటారని, పార్టీ కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అందరూ హాజరుకావాలని కోరారు.

వైద్యసేవల వివరాలను ఆన్‌లైన్ చేయాలి

బొండపల్లి: వైద్య సిబ్బంది తాము నిర్వహించే సేవల వివరాలన్నీ ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేయాల ని జిల్లా ప్రోగ్రాం అధికారి మోహన్‌రావు సూచించారు. మొబైల్ అకాడమీ, కిలారి యాప్‌ల వినియోగం, సేవలను ఆన్‌లైన్ చేసే విధానంపై దేవుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలకు మంగళవారం అవగాహన కల్పించారు. రోగులను గుర్తించడం, వారికి అందించే సేవలతో పాటు మందుల వివరాలన్నీ ఈయాప్‌లోనే నమోదు చేయాల్సి ఉంటుందన్నారు.

ఇలా అయితే ఎలా?



మార్కెట్‌లోకి వెళ్లే దారిలో ఆటోలు పార్కింగ్ చేయడంతో బరువు తట్టలతో లోపలికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న రైతులు

- నిబంధనలకు విరుద్ధంగా ఆటోల పార్కింగ్
- మార్కెట్‌లోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న రైతులు

రామభద్రపురం: మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ ఆటోల పార్కింగ్‌కు అడ్డగోలుగా మారింది. రైతులు రాకపోకలు సాగించే మార్కెట్ రోడ్డులో ఎక్కడపడితే అక్కడ ఆటోలు పార్కింగ్ చేసేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి కూరగాయల తట్టలు మోసుకుంటూ వచ్చే రైతులకు రోడ్డుకు అడ్డుగా ఉన్న ఆటోలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నా.. మార్కెట్‌లో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు ఉంచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్‌టీసీ బస్టాండు పక్కన మార్కెట్‌లోకి వెళ్లే తోవలో కూడా వాహనాలు నిలిపివేస్తుండడంతో రైతులు బరువు తట్టలతో లోపలికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా అయితే ఎలా అని, దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పైడితల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి తదితరులు

బొబ్బిలి: విజయనగరంలో మంగళవారం జరిగిన సిరిమానోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పాల్గొని, పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వెళ్లిన ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికి, ఆలయ పూజారులతో అమ్మవారి ఆశీర్వచనాలు అందజేయించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో నిత్యం వర్ధిల్లాలని ఎమ్మెల్యే అమ్మవారిని వేడుకున్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ నేత శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీపీ లక్ష్మి ఉన్నారు.

పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

రాజాం: పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తుందని వైఎస్సార్‌సీపీ రాజాం మండల కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలోని మారేడుబాక గ్రామానికి చెందిన పేదలకు మంగళవారం జగనన్న ఇంటి పట్టాలు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ఇటువంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ఒక్కటి కూడా అమలుచేయలేదని ఎద్దేవచేశారు. జన్మభూమి కమిటీలకు, టీడీపీ కార్యకర్తలకు మాత్రమే పనికివచ్చేలా పథకాలు రూపొందించి, ప్రజాధనాన్ని లూటీ చేశారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం నేరుగా లబ్ధిదారులకే అర్హత ఆధారంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డీబీటీ విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇల్లులేని పేదలకు పక్కా ఇల్లు మంజూరు చేయడమే కాకుండా ఇంటి స్థలాలు లేనిపేదలకు ఇంటి స్థలాలు కూడా ఇస్తున్నారని వివరించారు. లబ్ధిదారులు వీటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, మారేడుబాక గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామసభలో ఉపాధిపనుల గుర్తింపు



ఉపాధి ప్రణాళికలు వివరిస్తున్న ఏపీఓ హరనాథరావు

రేగిడి: గ్రామసభల ద్వారా ఉపాధిపనులు గుర్తిస్తున్నామని ఏపీఓ ఎస్.హరనాథరావు అన్నారు. మండలంలోని తాటిపాడు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టేందుకు గాను రైతులు, గ్రామస్తులకు అవసరమైన పనులు గుర్తించనున్నట్లు చెప్పారు. పనుల ప్రణాళికను మ్యాప్ ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.బాబురావునాయుడు, కార్యదర్శి చిన్నారావు, ఎంపీఈఓ చిన్ని, ఈసీ రామినాయుడు, టీఏ రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలోనే సూపర్ స్పెషాలిటీ వైద్యం



రేగిడి: ఉంగరాడలో రోగులకు మెడికల్ కిట్లు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ తలే రాజేష్, అచ్చెన్నాయుడు, తదితరులు



రాజాం: ఒమ్మిలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు రాజగోపాలనాయుడు, నర్సింహులు తదితరులు

రాజాం, రేగిడి: ప్రజలకు గ్రామస్థాయిలోనే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు కొనసాగుతున్నాయి. రాజాం మండలం ఒమ్మి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, తదితరులు సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. రేగిడి మండలం ఉంగరాడ గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ తలే రాజేష్, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు పరిశీలించారు. వైద్య సేవలు పొందిన రోగులకు మందులు అందజేశారు.

రైతన్నకు కలిసొచ్చిన మొక్కజొన్న



కొండకెంగువ వీధిలో జొన్నలు ఆరబెడుతున్న రైతులు



గొల్లపేటలో జొన్నగింజలు బస్తాలకు ఎత్తుతున్న మహిళా రైతులు



మామిడివలసలో విక్రయానికి సిద్ధం చేసిన మొక్కజొన్న బస్తాలు

రామభద్రపురం: మొక్కజొన్న పంట ఈ ఏడాది రైతులకు కలిసి వచ్చింది. ఏటా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే మొక్కజొన్న పంట చేతికి అందక రైతులు నానా ఇబ్బందులు పడేవారు. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఎక్కువగా తుపానులు, అకాల వర్షాలతో పంట చేతికి రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. అరకొరగా వచ్చిన పంట కూడా రంగు మారడంతో జొన్నలను కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు వచ్చేవారు కాదు. ఈ ఏడాది మాత్రం భారీ వర్షాలు లేకపోవడం, సాధారణ వర్షాలతో మొక్కజొన్న పంట రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికే రైతులు తమ పంటను కల్లాల్లోకి తెచ్చుకున్నారు. కొంత వరకు దిగుబడి తగ్గినా పంట ఇంటికి చేరడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. మండలంలో 1155 మంది రైతులు 1679.08 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. కొట్టక్కి, రావివలస, రొంపల్లి, కొండకెంగువ, గొల్లపేట, జన్నివలసల్లో ఎక్కువగా ఈ పంట సాగు చేశారు. ఎకరాకు సుమారు 20 నుంచి 25 బస్తాల వరకు దిగుబడి వస్తుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.